నిరంతర సాధనతోనే కలల సాకారం: కలెక్టర్


విద్యార్థులతో మాట్లాడుతున్న రాహుల్ రాజ్

తూప్రాన్, న్యూస్‌టుడే: లక్ష్యాన్ని నిర్దేశించుకుని, తల్లిదండ్రుల కలలను సాకారం చేసేందుకు నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ విద్యార్థులకు సూచించారు. తూప్రాన్ పురపాలక పరిధి అల్లాపూర్ శివారులో టోల్గేట్ వద్దనున్న తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో ఓ పరిశ్రమ సహకారంతో నిర్మించిన స్టడీహాల్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులతో ముచ్చటించి, భౌతిక శాస్త్రం పాఠ్యాంశాన్ని బోధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ ప్రభుత్వ నిధులతో జిమ్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జ్యోతి, కమిషనర్ ఖాజా మోయినోద్దీన్, తహసీల్దార్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రవాహం.. రాజగోపురంలోనే పూజలు



పాపన్నపేట, న్యూస్‌టుడే: సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం వద్ద వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం కూడా ఆలయం వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉండడంతో రాజగోపురంలోనే అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగాయి. భక్తులు మాతను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 13,000 క్యూసెక్కుల వరద దిగువకు ప్రవహిస్తోంది.

మంత్రిని కలిసిన ట్రాన్స్‌కో డీఈఈ



మెదక్, న్యూస్‌టుడే: మంత్రి దామోదర్ రాజనర్సింహను ట్రాన్స్‌కో మెదక్ డీఈఈ చాంద్‌షరీఫ్ బాషా బుధవారం కలిశారు. హైదరాబాద్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అల్లాదుర్గం మండలంలో విద్యుత్తు సమస్యలను పరిష్కరించాలని మంత్రి ఆదేశించారని డీఈఈ తెలిపారు.

ప్రణాళికతో నియోజకవర్గ అభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

మెదక్, మెదక్‌రూరల్, న్యూస్‌టుడే: నియోజకవర్గాన్ని ప్రణాళికతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పది నెలల్లో రూ.45 కోట్ల నిధులు తెచ్చి, పనులు చేపడుతున్నామని స్పష్టం చేశారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తామని, ఇప్పటికే ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేయగా, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సిటీస్కాన్ యంత్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలో పిల్లల ఉద్యానవనం ఏర్పాటు చేస్తామని, పట్టణంలో గోసముద్రం, మండలంలో కొంటూరు చెరువును సుందరీకరించి మహనీయుల విగ్రహాలను, మెదక్‌లో భారీ అంబేడ్కర్, హనుమాన్ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నామన్నారు. గత ప్రభుత్వంలో పాలకులు ప్రజలను దోచుకున్నారని ఆరోపించారు. ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నామన్నారు. కొత్త పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, లింగం, శేఖర్, నాయకులు పవన్, విశాల్‌రాజ్ పాల్గొన్నారు. విద్యుదాఘాతానికి గురైన మండలంలోని మంబోజిపల్లిలోకి చెందిన విద్యార్థిని గాయత్రిని ఎమ్మెల్యే పరామర్శించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు.

వైద్య విద్యకు వేళాయే...

● నేడు కళాశాలను ప్రారంభించనున్న మంత్రి దామోదర్



న్యూస్‌టుడే, మెదక్: జిల్లాకు మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాల గురువారం అందుబాటులోకి రానుంది. మంత్రి దామోదర్ రాజనర్సింహ కళాశాలను ప్రారంభించనున్నారు. విద్యా పరంగా జిల్లా కొంత వెనుకబడి ఉంది. ఉన్నత విద్యకు సంబంధించి ప్రభుత్వ విద్యా సంస్థలు లేవు. ప్రైవేటులో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల జిల్లాకు మంజూరు కావడం విశేషం. గత సెప్టెంబరు 10వ తేదీన కళాశాల ఏర్పాటుకు జాతీయ వైద్య కమిషన్ అనుమతి ఇచ్చింది. మెదక్ పట్టణంలోని పిల్లికోట్టాల్ వద్ద పాత కలెక్టరేట్ భవనంలో కళాశాలను ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య కళాశాలలో 50 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 85 శాతం రాష్ట్ర విద్యార్థులకు, 15 శాతం ఆల్ ఇండియా (నేషనల్) కోటాకు కేటాయించారు. నీట్ ద్వారా అర్హత సాధించిన విద్యార్థులతో సీట్ల భర్తీ చేపట్టారు. నేషనల్ కోటాలో ఏడుగురు విద్యార్థులకు ఆరుగురు, రాష్ట్ర కోటాలో 41 మంది ప్రవేశం పొందారు.


హిస్టాలజీ ల్యాబ్

ప్రజలకు మెరుగైన సేవలు...: వైద్య కళాశాల ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందనుంది. జిల్లా ఆసుపత్రిలో పడకల సామర్థ్యాన్ని పెంచుతారు. ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే నాణ్యమైన వైద్యం పొందే అవకాశం ఉంటుంది. విద్యార్థులు చికిత్స విధానాన్ని ఆసుపత్రిలో నేర్చుకునే అవకాశం ఉంటుంది.

సకలం సిద్ధం...: పాత కలెక్టరేట్ భవనంలో కళాశాలను నిర్వహించనున్నారు. తరగతి గదులు, ప్రయోగశాలలు ఇతర విభాగాల గదులను సిద్ధం చేశారు. కళాశాల ఆవరణలోనే విద్యార్థి, విద్యార్థినులకు వేర్వేరుగా వసతి గృహం ఏర్పాటు చేశారు. ప్రవేశం పొందిన విద్యార్థులతో ఆయన సమావేశం కానున్నారు. నవంబరు మొదటి వారంలో వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి సంవత్సరం అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ తదితర తరగతులు నిర్వహిస్తారు. మొదటి ఏడాది దాదాపు వైద్యకళాశాలలోనే తరగతులు ఉంటాయి. రెండో ఏడాది నుంచి తరగతులతో పాటు ఆసుపత్రుల్లో చికిత్సలపై శిక్షణ ఉంటుంది. జిల్లా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఇందుకోసం వినియోగించుకుంటారు. ల్యాబ్ గదులను సిద్ధం చేస్తున్నారు. అలాగే పరికరాలను తెప్పిస్తున్నారు.

33 మంది బోధనా సిబ్బంది...: తరగతులకు బోధన కోసం అధ్యాపకులను నియమించారు. ప్రస్తుతం ఒక ప్రిన్సిపల్, 14 మంది ప్రొఫెసర్లు, 19 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు చేరారు. మరో 10 మంది సహాయక ప్రొఫెసర్లు రానున్నారు.

వచ్చే నెలలో తరగతులు: కళాశాలలో 50 సీట్లకు 48 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు చేరారు. కళాశాల ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వచ్చే నెలలో తరగతులు మొదలవుతాయి.
రవీందర్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు


చండిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సునీతా రెడ్డి

శివ్వంపేట, నర్సాపూర్, న్యూస్‌టుడే: సన్న ధాన్యానికి కూడా రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు. శివ్వంపేట మండలం చండి, లచ్చిరెడ్డిగూడెం, నవాబ్‌పేట, చెన్నాపూర్, చిన్నగొట్టిముక్ల, తిమ్మాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా కొనుగోలు చేయాలన్నారు. తహశీల్దార్ కమలాద్రి, హరికృష్ణ, మన్సూర్, రమణగౌడ్, పాల్గొన్నారు. పేదల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి భరోసా ఇస్తోందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. నర్సాపూర్ కార్యాలయంలో ముగ్గురికి రూ.60వేల విలువైన చెక్కులను అందజేశారు. బల్దియా ఉపాధ్యక్షులు నయీమోద్దీన్, బబ్యానాయక్ పాల్గొన్నారు.

కూరగాయల వ్యాపారం ఎలా నడుస్తోందమ్మా!


పాతూరు మార్కెట్లో కాకరకాయలు కొంటున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్, న్యూస్‌టుడే: సిద్దిపేట నుంచి హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యలో ప్రజ్ఞాపూర్ శివారులో రాజీవ్ రహదారి పక్కన ఉన్న పాతూరు కూరగాయల మార్కెట్‌ను మాజీ మంత్రి హరీశ్ రావు బుధవారం రాత్రి సందర్శించారు. రైతుల వద్దకు వెళ్లి పలకరించారు.

పల్లె వాతావరణం బాగుంది


అవంచలో అంగన్‌వాడీ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సివిల్ సర్వీసెస్ అధికారులు

నర్సాపూర్ రూరల్, కౌడిపల్లి, తూప్రాన్, మనోహరాబాద్, రామాయంపేట, న్యూస్‌టుడే: మండలంలోని అవంచ గ్రామాన్ని సివిల్ సర్వీసెస్ అధికారులు బుధవారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, చిన్నారులతో కలిసి భోజనం చేశారు. ఉపాధిహామీ పనుల గురించి తెలుసుకున్నారు. కౌడిపల్లి మండలం రాయిలాపూర్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై పురోగతి గురించి తెలుసుకున్నారు. జడ్పీ సీఈవో ఎల్లయ్య వివిధ అంశాల గురించి వారికి వివరించారు. తూప్రాన్ మండలంలో పర్యటించి మల్కాపూర్ చాలా అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. గ్రామంలో వివిధ శాఖల పనితీరుపై అధ్యయనం చేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలో అధికారులు పర్యటించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. రామాయంపేట మండల పరిధి ప్రగతి ధర్మారంలో అధికారులు పర్యటించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యాలయంలో, మహిళా సంఘాలతో సమావేశమయ్యారు.

కష్టపడి చదివితేనే ఫలితం: డీఈవో


సాగుచేసిన ఆకుకూరలతో రాధాకిషన్

నర్సాపూర్ రూరల్: కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో రాధాకిషన్ పదో తరగతి విద్యార్థులకు సూచించారు. మండలంలోని పెద్దచింతకుంట ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి బోధన తీరుపై ఆరా తీశారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు సాగుచేస్తున్న పెరటి తోటను పరిశీలించారు. సాగు చేసిన ఆకుకూరలను చిన్నారులు డీఈవోకు ఇచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం

మనోహరాబాద్, తూప్రాన్, న్యూస్‌టుడే: పరిశ్రమల సహకారంతో అంగన్‌వాడీ కేంద్ర భవనాలు నిర్మించి, మౌలిక వసతులు కల్పించడం మంచి పరిణామమని జిల్లా సంక్షేమాధికారిణి హైమావతి అన్నారు. మనోహరాబాద్ మండల కేంద్రం, కొండాపూర్ గ్రామాల్లో నూతన అంగన్‌వాడీ భవనాలను బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె తూప్రాన్‌లోని కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం 7వ అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు.

ఆశలు కల్పించి.. నిరాశకు గురిచేసి..

● అటకెక్కిన ఆధునిక ధోబీఘాట్ల నిర్మాణం

న్యూస్‌టుడే పరిశీలన

న్యూస్‌టుడే, నర్సాపూర్, మెదక్ టౌన్, తూప్రాన్, రామాయంపేట: జిల్లాలోని నాలుగు పురపాలికల్లో ఆధునిక ధోబీఘాట్లు నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఒక్కో మున్సిపాలిటీకి రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఒక చోట పనులు ప్రారంభమై అసంపూర్తిగా దర్శనమిస్తుండగా, కొన్ని చోట్ల స్థలాల సేకరణతో సరిపెట్టారు. మరికొన్ని చోట్లా స్థలాన్ని కూడా గుర్తించలేదు. ప్రభుత్వం వీటిపై చొరవ చూపితేనే ప్రయోజనం ఉంటుంది. ఈ విషయమై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.

దేశ వ్యాప్తంగా పురపాలికల్లో ఆధునిక ధోబీ ఘాట్‌లతో రజకులకు ప్రయోజనం చేకూరింది. దీనిని దృష్టిలో ఉంచుకుని మన రాష్ట్రంలోనూ పట్టణాలు, నగరాల్లో, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియలో భాగంగా సౌరశక్తితో నడిచే యంత్రాలను ఏర్పాటు చేస్తే, దుస్తులు ఉతకడం, ఇస్త్రీ చేయడం సులువు అవుతుందని రజకులు ఆశించారు. తీరా ఎక్కడా వీటి పనులు పూర్తికాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలు, వసతిగృహాల నుంచి దుస్తులు, దుప్పట్లు ఉతికేందుకు రజకులను ఆశ్రయిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో యంత్రాలను సమకూరిస్తే వారి ఉపాధికి తోడ్పాటు అందించినట్లు అవుతుంది.

పనులు ప్రారంభించి...: నర్సాపూర్‌లో రాయరావు చెరువు సమీపంలో ఎకరం స్థలంలో రూ.2కోట్లతో పనులు ప్రారంభించారు. అప్పట్లోనే ప్రహరీ నిర్మించి, గేటును ఏర్పాటు చేశారు. ఆవరణలోనే భవనం పనులు పూర్తిచేశారు. కేవలం యంత్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం నిధుల కొరత సాకుగా చూపుతూ అసంపూర్తిగా వదిలేశారు. అధికారులు చొరవచూపాలని కోరుతున్నారు.

పొదలు ఆవరించి...: మెదక్ పట్టణం నవాపేట్‌లో రూ.కోటి నిధులతో శంకుస్థాపన చేశారు. ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. కేటాయించిన స్థలంలో పొదలు ఆవరించాయి.


నర్సాపూర్‌లో అసంపూర్తిగా..

స్థలం గుర్తించినా...: తూప్రాన్ పోతురాజ్‌పల్లి శివారులో స్థలాన్ని సేకరించినా పనులు మాత్రం ప్రారంభించడం లేదు. ఈ విషయాన్ని కమిషనర్ ఖాజామోయినోద్దీన్ వద్ద ప్రస్తావించగా, ఉన్నతాధికారుల ఆదేశాల కోసం చూస్తున్నామని అన్నారు. రామాయంపేటలో స్థలాన్ని సేకరించకపోవడంతో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లాయని అంటున్నారు.

ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలి...

ధోబీఘాట్ల నిర్మాణం త్వరగా పూర్తిచేసి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలి. యుద్ధప్రాతిపదికన పనులు జరిపించాలి. పట్టణాల్లో చాలామంది రజకులు ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు. ప్రభుత్వం స్పందించాలి. *సత్యనారాయణ, రజక సంఘం నాయకులు*

తగిన చర్యలు తీసుకుంటాం...:

నర్సాపూర్‌లో భవన నిర్మాణం పూర్తయ్యింది. యంత్రాలు ఏర్పాటు చేసి, త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. *రామకృష్ణారావు, కమిషనర్*

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి: టీపీటీఎఫ్


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సంగయ్య

రామాయంపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రామాయంపేటలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి పదినెలలైనా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా స్పందించాలని లేదంటే, పోరాటం తప్పదని హెచ్చరించారు. అనంతరం రామాయంపేట, నిజాంపేట మండల కమిటీలను ఏర్పాటు చేశారు. రామాయంపేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రమేష్, మల్లేశం, నిజాంపేట అధ్యక్ష, కార్యదర్శులుగా కిరణ్, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, రాష్ట్ర మాజీ కౌన్సిలర్ రామచంద్రం, కార్యవర్గ సభ్యులు యాదగిరి, హీరాలాల్, జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కార్యదర్శి రాజయ్య, జిల్లా కౌన్సిలర్ సురేందర్ తదితరులున్నారు.



ఏళ్లుగా ఇలానే..

వ్యాపారులకు తక్కువ అద్దెతో ఇచ్చే విధంగా నిర్మాణం చేపట్టిన దుకాణాల సముదాయాల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. చేగుంటలో 2012లో వీటి పనులు ప్రారంభించినా నిధుల లేమితో పూర్తి చేయలేదు. లోక్‌సభ ఎన్నికల కంటే ముందు దీనిని పూర్తిచేసేందుకు కాంగ్రెస్ నాయకులు కొబ్బరికాయలు కూడా కొట్టారు. అయినా ఇంకా పనులు ప్రారంభించడంలేదు. ప్రతిసారి అధికారులు, ప్రజాప్రతినిధులు చూసి వెళ్తున్నారు. ఇప్పటికైనా పూర్తి చేయాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, చేగుంట

న్యాయం చేయాలని బాధిత కుటుంబీకుల ఆందోళన


ఠాణా వద్ద గుమిగూడిన బాధిత కుటుంబ సభ్యులు,

కౌడిపల్లి, న్యూస్‌టుడే: పంట రక్షణకు బిగించిన విద్యుత్తు కంచె తగిలి కౌడిపల్లి మండలం జాజితండాకు కాట్రోత్ బుజ్జిబాయి మంగళవారం మృతి చెందిన విషయం విదితమే. ఈ ఘటనపై ఆగ్రహంతో ఉన్న బాధిత కుటుంబ సభ్యులు, తండావాసులు బుధవారం కౌడిపల్లి ఠాణా వద్ద ఆందోళన చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు కంచెను ఏర్పాటు చేసి, ప్రమాదానికి కారణమైన శోభ కుటుంబీకులను తమకు అప్పగించాలని పట్టుబట్టారు. పోలీసులు వారిని సముదాయించి, తండా పెద్దలతో మాట్లాడి శోభ కుటుంబ సభ్యులతో కొంతమొత్తం ఇచ్చేలా ఒప్పంద పత్రం రాసుకున్నారు. అయినా నష్టపరిహారం సరిపోదని బాధితులు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఎస్సై రంజిత్‌రెడ్డి మెదక్ టౌన్ నుంచి అదనపు సిబ్బందిని రప్పించారు. తండా వాసులు ఠాణా లోపలికి రాకుండా గేట్లను మూసి వేయించారు. నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి స్థానిక ఠాణాకు చేరుకుని బాధితులను సముదాయించి, పంపించివేశారు. తండాలో ముందు జాగ్రత్తగా శోభా ఇంటి వద్ద పోలీసులను మోహరించారు. మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

వడ్ల కొనుగోలులో స్పష్టతేది?కొత్త ప్రభాకర్‌రెడ్డి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నార్సింగి(చేగుంట), న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నా, ఎక్కడా కొనుగోలు చేయడం లేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం నార్సింగిలో కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ అకాల వర్షాలతో వడ్లు తడిసి రైతులు నష్టపోతున్నా ప్రభుత్వానికి కనువిప్పు కలగడంలేదన్నారు. జిల్లాలో కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు కొనుగోలు విషయంలో స్పష్టతలేదన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ధాన్యం దిగుబడులు అధికంగా వచ్చాయని, కొనుగోలు లేక రహదారులు పూర్తిగా నిండిపోయాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ శశిధర్‌రెడ్డి, ఎంపీడీవో ఆనంద్, తహసీల్దారు కరీం పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనం ఇవ్వలేదని రైతు ఆత్మహత్యాయత్నం


డీజిల్ పోసుకుంటున్న శ్రీను

కౌడిపల్లి, న్యూస్‌టుడే: అటవీశాఖ రేంజ్ కార్యాలయం వద్ద రైతు ఆత్మహత్యకు ప్రయత్నించడంతో, సిబ్బంది అడ్డుకున్న ఘటన బుధవారం జరిగింది. చిలప్‌చెడ్ మండలం జయరాం తండాకు చెందిన బర్మావత్ శ్రీను కార్యాలయం ఎదుట ఒంటిపైన డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం తనకు మూడు ఎకరాల భూమి ఇచ్చిందని, ఇందుకు సంబంధించి అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ పట్టా అందించడంతో సాగు చేస్తున్నానని చెప్పారు. నాలుగు నెలల కిందట ట్రాక్టర్‌తో దున్నుతుండగా అటవీశాఖ అధికారులు సీజ్ చేసి, కేసు నమోదు చేశారన్నారు. కోర్టు నుంచి రిలీజ్ పత్రం తెచ్చినా, ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రేంజ్ అధికారి మనోజ్‌కుమార్, డిప్యూటీ రేంజ్ అధికారిణి రాజమణి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వాపోయారు. ఈ విషయమై అధికారిణి రాజమణిని వివరణ కోరగా అడవిలో అక్రమంగా దున్నుతుండగా ట్రాక్టర్ సీజ్‌చేసి కేసు నమోదు చేశామన్నారు. రిలీజ్ ఆర్డర్ తీసుకొని వచ్చాడని, అందుబాటులో లేనని వచ్చేవరకు ఆగమని సూచించినా డీజిల్ పోసుకున్నారని తెలిపారు. రిలీజ్ ఆర్డర్ శ్రీను సోదరుడు రవి పేరున ఉందని, అతడు రాగానే ట్రాక్టర్‌ను ఇచ్చామన్నారు. డబ్బులు అడిగామనేది అవాస్తమని, అడవిలో భూమి లేకున్నా ఉందని చూపుతున్నారని చెప్పారు.

పంటల బీమాపై చిగురిస్తున్న ఆశలు


యాసంగిలో వడగళ్లకు దెబ్బతిన్న మొక్కజొన్న

న్యూస్‌టుడే, వేగుంట: పంట చేతికి వస్తున్న తరుణంలో అకాల వర్షాలు కురిసి అన్నదాతలు నష్టపోతున్నారు. చేసిన కష్టం వర్షార్పణం, వడగళ్లపాలు కావడంతో ఏటా వారికి ఆందోళన తప్పడంలేదు. రూ.వేలు పెట్టుబడులు పెట్టి నిరాశకు గురవుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పంటల బీమాను వచ్చే సీజన్ నుంచి ప్రారంభిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడం కర్షకుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో అధిక శాతం సాగే ఆధారం. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, కంది, పొద్దుతిరుగుడుతో పాటు కూరగాయలు సాగు చేస్తుంటారు. మొత్తం 2,80,949 మంది రైతులున్నారు. సాగు విస్తీర్ణం 3,41,915. గత వర్షాకాలంలో 2,98,067 ఎకరాల్లో వరి సాగు చేశారు. వీటితో పాటు మొక్కజొన్న, పత్తి సాగైంది. 2023 యాసంగిలో 2,10,527 ఎకరాల్లో సాగు చేశారు. 2023 ఏప్రిల్, మేలో వరి పంట చేతికి వస్తున్న సమయంలో వడగళ్ల వర్షం కురవడంతో వేలాది ఎకరాల్లో పంటకు నష్టం జరిగింది. 33,264 మంది రైతులు నష్టపోగా, 32,718 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా ధాన్యం నేలరాలి రూ.లక్షల్లో నష్టపోయారు. అయినా ప్రభుత్వం ఆదుకోలేదు. 2024 మార్చిలో చేగుంట, రామాయంపేట, చిన్నశంకరంపేట, నిజాంపేట మండలాల్లో అకాల వర్షాలు కురిసి 714.17 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. యాసంగిలో జిల్లాలో వరి 2,65,000 ఎకరాలు, మొక్కజొన్న 2,700 ఎకరాలు, జొన్న 8,810 ఎకరాలు, శనగ 280 ఎకరాలు, పొద్దుతిరుగుడు 430 ఎకరాలు, వేరుసెనగ 130 ఎకరాలు, ఇతర పంటలు 6,486 ఎకరాల్లో సాగు చేయనున్నారు. ఇలాంటి పంటలకు ప్రకృతి విపత్తుల కారణంగా బీమాతో ప్రయోజనం చేకూరనుంది.

ప్రకృతి విపత్తులతో...:

వడగళ్లు కురిసినా, వర్షాలు లేక పంటలు ఎండిపోయినా సాగు సమయంలోనే రైతులు వాటికి బీమా చేసుకుంటే ఉపయోగంగా ఉంటుంది. పంట చేతికి వచ్చినప్పుడు ప్రకృతి కరుణించకపోవడంతో రైతులకు బీమా డబ్బులు వచ్చే ఆస్కారం ఉండేది. గతంలో గ్రామం యూనిట్‌గా బీమా చేస్తుండేవారు. దీనివల్ల కర్షకులకు ప్రయోజనం ఉండేది. ఎకరాకు రూ.500 ప్రీమియం చెల్లిస్తే, నష్టపోయిన సమయంలో రూ.వేలాదిగా డబ్బులు వస్తుండేవి. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న సమయంలో బీమా ప్రీమియం డబ్బులు తీసుకునేవారు. నష్టపోతే వరి ఎకరాకు రూ.37,484, పత్తి రూ.36,282, మొక్కజొన్నకు రూ.18,742 పరిహారం వచ్చేది.

ఏఐఎస్ఎఫ్ చలో కలెక్టరేట్

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఉపకార వేతనాలు, బోధన రుసుం విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దినకర్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని బుధవారం చలో కలెక్టరేట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలుర కళాశాల నుంచి విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్‌లో వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో గేటు ముందు బైఠాయించి ధర్నా చేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు చేర్యాల విద్యార్థి



చేర్యాల, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాల్లో భాగంగా 19 ఏళ్లలోపు విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి కర్రోల్ల వరుణ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన వరుణ్ ఉమ్మడి మెదక్ జిల్లా జట్టులో చోటు దక్కించుకున్నాడని, త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ప్రిన్సిపల్, అధ్యాపక బృందం వరుణ్‌ను అభినందించి సన్మానించారు.

హాకీ పోటీలకు ఎంపిక



సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి హాకీ అండర్- 14, 17 పోటీలకు మల్కాపూర్ శివారులోని ప్రైవేటు స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14లో సోను, మహేర తంకీన్, చందన, ఇజ్రాయిల్, మహ్మద్ తకిఖాన్.. అండర్-17 పోటీలకు రిత్విక్, మహ్మద్ ఇస్మాయిల్ ఎంపికైనట్లు పాఠశాల ప్రతినిధులు చెప్పారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, శిక్షకులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



క్రీడా జ్యోతిని అందజేస్తున్న బీసీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సైదులు

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని, ఉజ్వల భవిష్యత్తుకు దారిచూపుతాయని బీసీ గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి బి.సైదులు అన్నారు. బుధవారం కొండపాకలోని మహాత్మా జ్యోతిబా పులే బీసీ గురుకుల పాఠశాలలో ఉమ్మడి మెదక్ జిల్లా బీసీ గురుకుల పాఠశాలల క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో మూడు రోజుల పాటు జరిగే క్రీడల్లో విద్యార్థులు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, డిస్కస్ త్రో, షార్ట్‌పుట్, పరుగుపందెం, చదరంగం పోటీలలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని తెలిపారు. అంతకుముందు పాఠశాలలో క్రీడా జ్యోతిని వెలిగించి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో బీసీ గురుకుల రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తిరుపతి, కొండపాక బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శివప్రసాద్ ఉన్నారు.

బాల ప్రతిభ.. భవిష్యత్తుకు నిచ్చెన

చదువులో ఉన్నంతగా బాలలు రాణించాలంటే కళలు, ఆటలు, ఇతర మంచి వ్యాపకాలు ఎంతో అవసరం. దీన్ని గుర్తించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల్ని ప్రోత్సాహిస్తుండటంతో ఉత్తమ ప్రతిభ చాటుతూ రాణిస్తున్నారు. ఓవైపు చదువులో ఉత్తమ మార్కులు పొందుతూనే మరో వైపు నృత్యం, క్రీడల్లో ప్రతిభ చాటుతున్న బాలలపై కథనం.

పరుగే ప్రాణం



కొడంగల్: కొడంగల్ గిరిజన గురుకులంలో ఇంటర్ చదువుతున్న ఎం.సుభాష్ క్రీడల్లో పరుగు పోటీల్లో విజయాలు సాధిస్తున్నాడు. పరిగి, కులకచర్ల, హైదరాబాద్ నగరంలో జరిగిన పోటీల్లో పాల్గొన్నాడు. 100, 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడు. వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్ అభినందించారు.

ఉత్తమ వికెట్ కీపర్



కొడంగల్: కొడంగల్ గిరిజన గురుకులంలో 8వ తరగతి చదువుతున్న ఆర్.సునీల్ క్రికెట్లో విజయాలు సాధిస్తున్నాడు. ఈ నెల 2న వికారాబాద్‌లో అండర్ 14 క్రికెట్ పోటీల్లో ఉత్తమ వికెట్ కీపర్‌గా సునీల్ బంగారు పతకం సాధించాడు. రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఇక్కడే 7వ తరగతి చదువుతున్న సాగర్.. ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా రాణించి బంగారు పతకానికి అర్హుడయ్యాడు. ఫైనల్‌లో 29 బంతుల్లో 42 పరుగులు తీశాడు.

ఇటు చదువు.. అటు క్రీడలు



జహీరాబాద్: జహీరాబాద్ మండలం హోతి (కె) శివారులో గల తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నందిని రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడల పోటీలకు ఎంపికైంది. అమ్మానాన్న కవిత, గోపాల్, శిక్షకులు సరిత, నాగయ్య ప్రోత్సాహంతో చదువు, క్రీడను సమన్వయం చేసుకుంటూ, రాణిస్తోంది. రోజూ తెల్లవారుజామునే లేచి వ్యాయామం, ఆట సాధన చేస్తుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 విభాగంలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

క్యూబింగ్‌లో పతకం



తాండూరు: తాండూరుకు చెందిన కందుకూరి చైత్ర రాష్ట్ర స్థాయిలో ఎస్ఎఫ్ఎ సంస్థ నిర్వహించిన రూబిక్స్ స్పీడ్ క్యూబింగ్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. అండర్-14 బాలికల విభాగంలో గచ్చిబౌలిలో పోటీ నిర్వహించగా 41 సెకన్లలో నిర్ణీత లక్ష్యాన్ని పూర్తి చేసింది. తాండూరు నేతాజీ గురుదేవ్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న చైత్రను తల్లిదండ్రులు వాణి, రాజ్‌కుమార్ ప్రోత్సహించారు. తాను జాతీయ స్థాయిలో పోటీ పడాలని మెలకువలు నేర్చుకుంటున్నానని చైత్ర చెప్పింది.

ఎన్‌సీసీ వేదికతో గుర్తింపు



గజ్వేల్ గ్రామీణ: చిన్నప్పుడే తండ్రిని కోల్పోయిన అతను చదువుతోపాటు ఆటల్లో, ఎన్‌సీసీలో రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చుకుంటూ సత్తా చాటుతున్న గజ్వేల్ పట్టణానికి చెందిన దూలం మణికంఠ తల్లి మంగమ్మ టైలరింగ్ పనులు చేస్తూ కుమారుడిని చదివిస్తున్నారు. చదువుతోపాటు అన్ని రంగాల్లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని చదువులో, ఆటలో రాణిస్తున్నాడు. గత మేలో హైదరాబాద్ ఎన్‌సీసీ శిబిరంలో పాల్గొని ప్రతిభ చాటుకోవడంతో అధికారులు జాతీయస్థాయి ట్రెక్కింగ్ క్యాంపునకు ఎంపిక చేశారు. ఈనెల రెండో వారంలో తిరుపతిలో ట్రెక్కింగ్ జరిగింది. మణికంఠ ప్రశంసాపత్రం అందుకున్నాడు. భవిష్యత్తులో ఆర్మీలో చేరాలనేది కోరిక అని బాలుడు చెప్పాడు.

స్ఫూర్తే ఆదర్శం



జోగిపేట: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది జోగిపేటకు చెందిన 7వ తరగతి విద్యార్థిని ఎ.స్ఫూర్తి. ప్రైవేటు బడిలో చదువుతోంది. తల్లిదండ్రులు శ్రీకాంత్, కరుణలు జోగిపేట క్రికెట్ కోచింగ్ కేంద్రంలో సంవత్సరం క్రితం చేర్పించారు. శిక్షకుల సలహాతో శివ వద్ద రాటుదేలుతోంది. నిత్యం ఉదయం 5 గంటలకే లేచి తండ్రితో కలిసి సాధన కోసం వెళ్తోంది. సాయంత్రం, సెలవు రోజుల్లోనూ సాధన చేస్తుంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో పరిణతి పొందింది. సంగారెడ్డిలో ఎస్‌జీఎఫ్‌లో ప్రతిభ చాటి అండర్-17 పోటీలకు ఎంపికైంది.

రాష్ట్ర స్థాయిలో ప్రాతినిధ్యం



తాండూరు: యాలాల మండలం ముకుందాపూర్‌కు చెందిన అర్చన రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో 2 కి.మీ. పరుగులో ప్రతిభ కనబరిచింది. బంగారు పతకాన్ని సాధించింది. రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనుంది. యాలాల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అర్చన.. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించే దిశగా సాధన చేస్తోంది.

నర్తిస్తారు.. మెప్పిస్తారు

వికారాబాద్ కలెక్టరేట్: వికారాబాద్ బాల కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థినులు శాస్త్రీయ, సంప్రదాయ పాటలు, భక్తి పాటలు, దేశభక్తి, జానపద పాటలకు అందరూ మెచ్చేలా నృత్యం చేస్తారు. గత నెలలో కాశీ విశ్వనాథస్వామి గడిలో 'రావణకృత శివతాండవం' నృత్యం చేసి భక్తులను అలరించారు. శ్రేయాన్వి, అనన్య, రష్మిక, పరిణతమాంబ, సౌమ్య, సృజన, వేదశ్రీ, సంహిత, జాహ్నవి, భవిత, శ్రీనిధి పాల్గొన్నట్లు, ఆలయ ట్రస్టు నుంచి ప్రశంసాపత్రం అందుకున్నట్టు బాల కేంద్రం సూపరింటెండెంట్, శిక్షకురాలు టీపీ అనురాధ తెలిపారు. గతంలో హైదరాబాద్, విజయవాడ, చెన్నైలోనూ పోటీల్లో పాల్గొని విజయం సాధించారు.



కాశీలో నృత్యం చేసిన బాలలు

అబ్బురపరిచే కళ



దుబ్బాక: దుబ్బాక మండలం రామక్కపేట విద్యార్థి బండి క్రాంతికుమార్.. చిన్నతనం నుంచే చిత్రలేఖనం (డ్రాయింగ్)పై మక్కువ పెంచుకున్నాడు. దుబ్బాక పురపాలికలోని లచ్చపేట ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు చంద్రకళ, భూమయ్య బీడీ కార్మికులుగా పని చేస్తూనే కుమారుడిని ప్రోత్సహిస్తున్నారు. పెన్సిల్, స్కెచ్, రంగులతో జాతీయ నాయకులు, దేవుళ్లు, ప్రకృతిని గీస్తూ అబ్బురపరుస్తున్నాడు. వర్గల్‌లో వికసిత్ భారత్‌పై చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ చాటాడు. సమగ్రశిక్షా ఆధ్వర్యంలో సిద్దిపేటలో కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. నవంబరులో రాష్ట్రస్థాయిలో పాల్గొననున్నాడు.



శరణ్యతో ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్, ఉపాధ్యాయులు

12 కథలు రాసిన బాలిక

హవేలీఘనపూర్: హవేలి ఘనపూర్ మండలం ఔరంగాబాద్‌కు చెందిన చెప్యాల మంజుల-సిద్ధయ్య దంపతుల కుమార్తె శరణ్య. హవేలి ఘనపూర్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. బాలసాహిత్య పీఠం నిర్వహించిన కథల పోటీల్లో 'జయహో' కథ బహుమతికి ఎంపికైంది. శరణ్య రెండేళ్ల నుంచి కథలు రాస్తోంది. ఉపాధ్యాయుడు ఉండ్రాళ్ల రాజేశం మెలకువలు నేర్పించారు. బాలిక 12 కథలు రాసింది. గతంలో తెలంగాణ సారస్వత పరిషత్ నుంచి బహుమతి అందుకుంది.

క్రమశిక్షణలో ముందు



ప్రహర్షికి అభినందనలు

సిద్దిపేట అర్బన్: నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ప్రహర్షి కథల పుస్తకాలు రాస్తూ తెలుగు సాహిత్యంలో రాణిస్తోంది. తల్లిదండ్రులు కారంకంటి కనకయ్య-రజిత. తండ్రి ఆటో నడుపుతున్నారు. తల్లి టైలరింగ్ చేస్తూ ముగ్గురు పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. 6వ తరగతి నుంచి ప్రహర్షి ప్రతిభ చాటుతోంది. నేషనల్ మిన్స్ మెరిట్ ఉపకార వేతనానికి ఎంపికైంది. అందమైన చేతిరాత బాలిక సొంతం. రోజూ ఉదయాన్నే 4 గంటలకు నిద్ర లేవడం అలవాటుగా చేసుకుంది. నాలుగు కథలు రాసింది. గతేడాది రాసిన మాంత్రికుని కోటలో చిన్న పిల్లలు కథల పుస్తకానికి రూ.500 బహుమతి అందుకుంది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో ప్రహర్షి రాసిన 'సాహసం' కథ ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. నవంబరు 3న హైదరాబాద్‌లో ప్రదానం చేయనున్నారు.

శాకాహారమే శ్రేష్ఠమైంది

ధ్యాన కేంద్రంలో సూచనలు

నర్సాపూర్, న్యూస్‌టుడే: మాంసాహారం తినడం రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలను శాకాహారం వైపు మళ్లించడానికి కొన్ని సంస్థలు ప్రయత్నం చేస్తున్నాయి. మనిషిలో పలు రోగాలకు కారణం మాంసాహారమేనని, శ్రేష్ఠమైన ఆహారం అంటే శాకాహారమేనని వారు చాటిచెబుతున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఇటీవల పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకుల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. గతంలో సెలవుదినాలు, పండగలు, ఎవరైనా చుట్టాలు వచ్చినప్పుడు మాత్రమే మాంసాహారాన్ని తీసుకునేవారు. ప్రస్తుతం కూరగాయలు, పప్పు దినుసులతో వంట చేసుకొని భోజనం తగ్గిపోయింది. నిత్యం మూడు పూటలా మాంసాహారం ప్రాధాన్యం పెరిగిపోయింది. పిల్లల్లో చదువులపై, పెద్దలకు శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతోందని వారు చెబుతున్నారు. నర్సాపూర్ పట్టణంలో ర్యాలీలో నినాదాలు చేస్తూ.. మాంసాహారం వల్ల నష్టాలను వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. మూగజీవులను సంరక్షించండి, అహింసాయుత భూమాతను ఆవిష్కరించడంలో భాగంగా అవగాహన చేపడుతున్నట్టు తెలంగాణ పిరమిడ్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు పేర్కొన్నారు. ధ్యాన కేంద్రంలో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, బుద్ధి వికాసం, ఆత్మ జ్ఞానానికి ధ్యానం అవసరాన్ని బోధిస్తారు.

సాత్వికాహారంతోనే ఆరోగ్యం: రాములుయాదవ్, ధ్యాన కేంద్రం నిర్వాహకుడు

అనారోగ్యం కారణంగా 2011 నుంచి శాకాహారానికి మారాను. ఎంతో చలాకిగా ఉండగలుగుతున్నాను. సాత్వికాహారంతోనే ఆరోగ్యంగా ఉండగలం. ధ్యానం వలన ప్రయోజనాలు ఉన్నాయి.



నర్సాపూర్‌లో శాకాహారంపై ర్యాలీ

పెద్దల జ్ఞాపకం.. పదుగురికి ఉపయుక్తం



ఎలక్ట్రిక్ వాహనం ఇదే

పరిగి, మోమిన్‌పేట, న్యూస్‌టుడే:

- మోమిన్‌పేటకు చెందిన మల్లేశం ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల ఉన్నట్టుండి స్పృహ కోల్పోయారు. ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు గంట నుంచి ఆటో కోసం కుటుంబ సభ్యుల వెదికారు. విషయం తెలిసిన అల్లుడు ఉచిత సేవలు అందిస్తున్న ఆటోను వినియోగించుకొని సకాలంలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.
- మోమిన్‌పేటకు చెందిన పల్లవి గర్భవతి. పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంది. ఊరిలోనే ఆసుపత్రి ఉన్నా దూరం కావడంతో ఆటోవాలాలు ఎవరూ రాలేదు. ఉచిత వాహనం సద్వినియోగమైంది.
- మల్లమ్మ తన కూతురు వద్దకు వెళ్లేందుకు ఇంటి నుంచి బస్టాండుకు బయల్దేరారు. మార్గమధ్యలో కాళ్లనొప్పులతో కూర్చున్నారు. ఓ మహిళ ఇచ్చిన సమాచారంతో ఆమెను బస్టాండులో ఉచిత వాహనంలో వదిలారు.

పదుగురికి మేలు చేయాలన్న ఓ యువకుడి ఆలోచన ఆచరణలోకి వచ్చి వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో ఉపయోగపడుతోంది. ఒక్కోసారి ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకొని ఆటోవాలాలు, ఇతర వాహనదారులు డిమాండు చేసి డబ్బు తీసుకొని వాహనంలో తీసుకెళ్తారు. ఉచిత ప్రయాణంతో యువకుడు ఆదర్శంగా నిలుస్తున్నారు. మోమిన్‌పేటకు చెందిన మహంతిరెడ్డిగారి విష్ణు తమ తల్లిదండ్రులు మహంతిరెడ్డి, స్వప్నల పేరిట వృద్ధులు, గర్భిణులు, కాలినడకన వెళ్లే విద్యార్థుల కోసం ఉచిత ప్రయాణం అందించాలని భావించారు. ఇదే విషయాన్ని అన్న లక్ష్మీకాంత్‌రెడ్డి, సోదరి సుష్మారెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో అంగీకరించారు. రూ.6లక్షలు వెచ్చించి పర్యావరణానికి మేలు కలిగించే ఎలక్ట్రిక్ వాహనాన్ని బెంగళూరు నుంచి కొనుగోలు చేసి తెప్పించారు. గ్రామం చివరి నుంచి బస్టాండు వరకు రెండు కిలోమీటర్ల దూరం ఉండటంతో ఇది ఉపయోగపడుతోందని చెబుతున్నారు. ఈనెల 5న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అనాథశ్రమంలో ఉంటూ బడికి వెళ్తున్న విద్యార్థులను ఉదయం, సాయంత్రం వేళల్లో ఉచిత వాహనంలో తరలిస్తున్నారు.

బడికి తీసుకెళ్లే బస్సే బలిగొంది

సహాయకుడు లేకపోవడంతో చిన్నారిని ఢీకొట్టిన డ్రైవర్



చిన్నారి అశ్విని →

ఘటనాస్థలంలో విలపిస్తున్న బంధువులు

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: నిత్యం టాటా చెబుతూ చిరునవ్వుతో బడికి వెళ్లే ఆ చిన్నారి ఆనందాన్ని చూసి విధికి కన్నుకుట్టిందేమో.. ప్రతి రోజూ పాఠశాలకు తీసుకెళ్లే బస్సే బాలిక పాలిట మృత్యుశకటంగా మారి బలి తీసుకుంది. క్షేమంగా తిరిగి వస్తుందనుకున్న తమ కూతురు తిరిగి రాని లోకాలకు వెళ్లిందన్న సమాచారం తెలుసుకుని కన్నవారు గుండెలవిసేలా రోదిస్తున్నారు. పెద్దశంకరంపేట మండలం మక్తలక్ష్మాపురం గ్రామం వద్ద ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు ఢీకొని విద్యార్థిని దుర్మరణం చెందిన ఘటన బుధవారం జరిగింది. సీఐ రేణుక తెలిపిన ప్రకారం మక్తలక్ష్మాపురం గ్రామానికి చెందిన బోయిని చంద్రమోహన్, సరితలకు ఇద్దరు కుమార్తెలు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమార్తె అశ్విని (6) పెద్దశంకరంపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. బుధవారం పాఠశాల బస్సులోనే బడికి వెళ్లి, సాయంత్రం తిరిగి వచ్చింది. రోడ్డు దాటుతుండగా డ్రైవర్ చూసుకోకుండా బస్సును ముందుకు పోనివ్వడంతో అశ్వినిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో డ్రైవర్ పరారయ్యాడు. బస్సులోని విద్యార్థులు భయంతో ఇళ్లకు పరుగులు తీశారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడికి చేరుకుని బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్, పాఠశాల యాజమాన్యం గ్రామానికి వచ్చే వరకు మృతదేహాన్ని తరలించేది లేదని బంధువులు, గ్రామస్థులు రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. పోలీసుల జోక్యం చేసుకుని సర్ది చెప్పడంతో విరమించారు. మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విశ్రాంత ఉద్యోగి దుర్మరణం



మహమూద్ మియా

పాపన్నపేట, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో విశ్రాంత ఉద్యోగి మృతి చెందిన ఘటన పాపన్నపేట శివారులో బుధవారం జరిగింది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన ప్రకారం యూసుఫ్‌పేటకు చెందిన మహమూద్ మియా (65) స్థానిక తపాలా కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీ విరమణ పొందారు. బుధవారం మధ్యాహ్నం స్కూటీపై పాపన్నపేటకు కూరగాయల కొనుగోలుకు వస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వాహనం ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. మహమూద్ మియాకు భార్య కౌసర్ సుల్తానా, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మూడు రోజుల కిందట చిన్న కుమార్తె నిశ్చితార్థం జరిగింది. అంతలోనే ఇలా జరగడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగింది.

ఎదురెదురుగా బైకులు ఢీకొని ఎలక్ట్రీషియన్..



బాలకృష్ణ

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కంచన్‌పల్లి గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దుంపల నాగమణి, విఠల్ కుమారుడైన బాలకృష్ణ (21) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. మానెపల్లి గ్రామానికి జంగల్ల భూమేశ్‌తో కలిసి వెళ్తున్నారు. మానెపల్లి నుంచి ఎదురుగా వస్తున్న తల్లీకుమారులు పెంటయ్య, నర్సమ్మల వాహనం ఢీకొంది. ప్రమాదంలో కింద పడిన బాలకృష్ణ తలకు తీవ్రగాయాలయ్యాయి. అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. నర్సమ్మకు గాయాలు కావడంతో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలకృష్ణ తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



రాజిరెడ్డి

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుస్నాబాద్ మండలం కూచనపల్లికి చెందిన సింగిరెడ్డి రాజిరెడ్డి(55) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తోట మహేశ్ తెలిపారు. అక్కన్నపేట మండలంలో నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టులో గుడాటిపల్లి గ్రామం ముంపునకు గురైంది. దీనితో రాజిరెడ్డి కూచనపల్లిలో ఇల్లు నిర్మించుకున్నాడు. అతిగా మద్యం తాగడంతో ఆరోగ్యం చెడిపోయింది. చికిత్స తీసుకున్నా నయం కాలేదు. ఈ నెల 22న తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్దూరు మండలంలో మరో యువకుడు..



రాజు

చేర్యాల(మద్దూరు), న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూరు గ్రామ రైతు కుటుంబానికి చెందిన పూల మల్లేశం- బూదమ్మ ఏకైక కుమారుడైన రాజు(22) బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. డిగ్రీ వరకు చదివిన రాజు కొన్నాళ్ల క్రితం వరకు స్థానిక పాల ఉత్పత్తిదారుల కేంద్రంలో పని చేశాడు. వ్యవసాయంలో తల్లిదండ్రులకు సాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం పొలంలో తీసిన పత్తి విక్రయించిన అనంతరం సాయంత్రం తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కడుపులో నొప్పి వేస్తోందని తన మిత్రుడికి చెప్పడంతో వెంటనే లద్నూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు జనగామ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. అతని ఆత్మహత్యకు కారణం తెలియలేదు. ఈ ఘటనపై మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్‌ను అడుగగా ఆత్మహత్య సమాచారం ఉంది కానీ దానిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు. ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేస్తామన్నారు.

వనదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.39.91 లక్షలు



లెక్కిస్తున్న సిబ్బంది, సేవాసమితి సభ్యులు

పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి హుండీల ద్వారా రూ. 39,91,361 ఆదాయం సమకూరింది. దీనికి అదనంగా బంగారం, వెండి ఆభరణాల కానుకలొచ్చాయి. ఈవో చంద్రశేఖర్, హుండీ లెక్కింపు ఇన్‌ఛార్జి సుధాకర్‌రెడ్డి సమక్షంలో ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు గోకుల్‌షెడ్‌లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. 83 రోజుల్లో ఆ ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

ఆధునిక పరికరం.. ప్రమాదాల నివారణం

న్యూస్‌టుడే, జిన్నారం:

పరిశ్రమల్లో చిన్న లోపం ఉన్నా ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసే వ్యాపారులకు తెలిసేలా ప్రభుత్వం పర్యవేక్షిస్తోంది. దీనివల్ల పరిశ్రమల యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఉత్పత్తి ప్రాసెస్‌లో తేడా ఉంటే వ్యాపారులు వస్తువులను కొనరు. ఉత్పత్తి విషయంలోనైనా ప్రమాదాల నివారణకైనా ఆధునిక సాంకేతిక పరికరాల ద్వారా అప్రమత్తం అవుతున్నారు. పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కర్మాగారాల భద్రతా శాఖ యాజమాన్యాలను అప్రమత్తం చేస్తోంది.



రియాక్టర్ వద్ద ఆటోమేటిక్ యంత్రం

రియాక్టర్లు, రసాయనాల నిల్వ ప్రాంతాలు కీలకం

పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే ప్రాణ, ఆస్తి నష్టం ఉంటుంది. యూనిట్లలో ఎక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటాయో అక్కడే దృష్టి సారిస్తున్నాయి యాజమాన్యాలు. రియాక్టర్, సెంటర్ ఫీజ్, బాయిలర్, చిల్లింగ్ పాయింట్, రసాయనాల నిల్వ ప్రాంతాల్లో పరికరాలు ఏర్పాటు చేస్తున్నాయి. ప్రమాదాన్ని గుర్తించి వాటంతటవే నివారిస్తాయి. కార్మికులకు చిన్న పాటి ప్రమాదం జరిగితే అత్యవసర కంటి శుభ్ర షవర్‌లను ఏర్పాటు చేసుకున్నారు.

కార్మికులకు చైతన్యం

పరిశ్రమల్లో పని చేసే ప్రతి కార్మికుడిని చైతన్యం చేసే చర్యలు ప్రతి పరిశ్రమలో కనిపిస్తాయి. మాక్‌డ్రిల్ ద్వారా కార్మికుల అప్రమత్తతను పరీక్షిస్తారు. నెలకు ఓసారి మాక్‌డ్రిల్ ఉంటుంది. పరిశ్రమల గోడలపై కార్మికులు, ప్రతినిధుల అవగాహనకు చిత్రాలు వేస్తారు. అవి చాలా తోడ్పడతాయని ఎస్ఎంఎస్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ టీఎస్ఎం శేఖర్ చెప్పారు. కార్మికులకు భద్రత పోటీలు నిర్వహిస్తారు. చైతన్యం కలిగిస్తారు. ఉత్పత్తులకు ఆర్డర్లు ఇచ్చే వివిధ దేశాల ప్రతినిధులు సైతం కార్మికుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను ఆరా తీస్తారు.

అప్రమత్తతే ఆయుధం

– పీవీ నాయుడు, పరిశ్రమ భద్రతా విభాగ అధికారి



పరిశ్రమల్లో పని చేసే ప్రతి కార్మికుడు అప్రమత్తంగా ఉండాలి. యాజమాన్యాలు ప్రత్యేక శిక్షణ ఇవ్వటంతో పాటు అందుబాటులోకి వచ్చిన పరికరాలను సమకూర్చుకుంటాయి. అన్ని రకాల రసాయన పరిశ్రమల్లో ఈ విధానం కనిపిస్తుంది.

మార్పులతోనే మార్కెట్‌ను ఎదుర్కోగలం

– నాగేశ్వరరావు, పరిశ్రమల విభాగం ఎండీ, ఐడీఏ బొల్లారం



ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యాజమాన్యాలు మార్చుకుంటున్నాయి. అప్పుడే నేటి మార్కెట్‌ను ఎదుర్కోగలమని గ్రహించారు. ఆధునిక పరికరాలు సమకూర్చుకుంటున్నాయి.

'కాగ్నిజెంట్'లో గురుకుల విద్యార్థులు

వర్గల్, న్యూస్‌టుడే: వర్గల్ మహాత్మా జ్యోతిబా పులే వెనుకబడిన తరగతుల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థినులు బుధవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని కాగ్నిజెంట్ సంస్థను సందర్శించారు. విద్యాలయం నుంచి వెళ్లిన 15 మంది విద్యార్థినులతో విదేశాలకు చెందిన సంస్థ ప్రతినిధులు మమేకమై పలు అంశాలపై అవగాహన కల్పించారు.

సమీకృత మార్కెట్ సందర్శన

గజ్వేల్, న్యూస్‌టుడే: గజ్వేల్ సమీకృత మార్కెట్‌ను సూర్యాపేట జిల్లా మార్కెటింగ్, పురపాలక శాఖ అధికారులు బుధవారంసందర్శించారు. డీఎంవో సంతోష్ కుమార్, డీఈ సత్యనారాయణ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు మార్కెట్లో కలియతిరిగి రైతులు, వ్యాపారులకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లో జరుగుతున్న లావాదేవీల గురించి కార్యదర్శి జాన్ వెస్లీ వారికి వివరించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

బోరుబావి గుంత పూడ్చివేత

ఈనాడు చిత్రానికి స్పందన

తూప్రాన్, న్యూస్‌టుడే: తూప్రాన్ పట్టణం 5 వార్డులో ఓ బోరుబావి ప్రమాదకరంగా ఉంది. సమస్యపై 'బోరుబావి ప్రమాదకారి' శీర్షికన బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి పురపాలిక అధికారులు స్పందించారు. ఐదో వార్డులో సూపర్ మార్కెట్ వెనుక బోరు బావి పక్కన గుంతను కమిషనర్ ఖాజామొయినొద్దీన్ ఆదేశాల మేరకు పూడ్చివేశారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్



నర్సాపూర్ పట్టణం మీదుగా మెదక్-నర్సాపూర్-హైదరాబాద్ (765-డి)జాతీయ రహదారిపై వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. రోజురోజుకు రహదారి ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. వాణిజ్య దుకాణాలకు వచ్చే వారికి పార్కింగ్ సౌకర్యం కల్పించక ఆ వాహనాలన్నీ రోడ్లపైనే నిలిపేస్తున్నారు. పరిశ్రమల్లో ఇతరత్రా పనుల మీద దూర ప్రాంతాలకు వెళ్లేవారు సైతం రోడ్ల పక్కన తమ వాహనాలను ఉంచి వెళుతున్నారు. మెదక్ మార్గంలో పాత పెట్రోలు బంకు నుంచి మొదలుకుని హైదరాబాద్ మార్గంలో ఎంపీడీవో కార్యాలయం వరకూ ఇదే పరిస్థితి. వీధి వ్యాపారులు సైతం తమ వ్యాపారాలను జాతీయ రహదారిపైనే కొనసాగిస్తున్నారు. ఇకనైనా అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నర్సాపూర్

పరిశ్రమలో అక్రమంగా కలప వినియోగం

పట్టించుకోని అటవీ అధికారులు



భీమ్లా తండాలో నేలకొరిగిన చెట్టు

న్యూస్‌టుడే, శివ్వంపేట: అక్రమంగా కలప వినియోగంతో భారీగా చెట్లు అంతరిస్తున్నాయి. రసాయన పరిశ్రమలు, లైట్ వెయిట్ ఇటుకల పరిశ్రమ, ఇటుక బట్టీలకు కలప ఉపయోగిస్తున్నారు. దీంతో అడవుల్లో చెట్లు సైతం నరికివేతకు గురవుతున్నాయి. పచ్చని చెట్లు కనుమరుగవుతున్నా అటవీశాఖ అధికారుల పర్యవేక్షణ కరవైంది. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు చేపట్టి అటవీ సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతి లేకుండా చెట్ల నరికివేత: శివ్వంపేట మండలంలో పలు చోట్ల పరిశ్రమలు, ఇటుక పరిశ్రమలు ఉన్నాయి. ఇటుక తయారీకి విచ్చల విడిగా కలప వినియోగిస్తున్నారు. దీంతో నిత్యం రూ.లక్షల్లో వ్యాపారం సాగిస్తుండడంతో కలపకు డిమాండ్ పెరిగింది. నిత్యం చెట్ల నరికివేత ఎలాంటి అనుమతులు లేకుండానే కొనసాగిస్తున్నారు. తుమ్మ, వేప, నీలగిరి, తురక వేప, సుబాబుల్ తదితర చెట్లను నరికేస్తున్నారు. దీంతో అంతటా పచ్చదనం అంతరించిపోతుంది.

అక్రమ కలప నిల్వపై జరిమానా: ఉసిరికపల్లి గ్రామ పరిధిలో ఉన్న పరిశ్రమలో లైట్ వెయిట్ ఇటుకల తయారీకి అక్రమంగా తుమ్మ, వేప తదితర కలప పరిమితి కంటే ఎక్కువగా నిల్వ చేయడంతో అటవీ అధికారులు రూ.50వేల వరకు ఇటీవల జరిమానా విధించారు. భీమ్లా తండా అడవిలో ప్లాంటేషన్ చెట్లు నరికివేతపై విచారించి చర్యలు చేపడతామని అటవీ అధికారులు చెబుతున్నారు. చెట్లు నరికేసిన వ్యక్తులు ఎవరో తెలియలేదన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపడతామని తెలిపారు.



ఉసిరికపల్లి ఇటుకల పరిశ్రమ వద్ద..

అడవుల్లో సైతం: మండలంలో పలు గ్రామాల్లో అడవులు విస్తారంగా ఉన్నాయి. తుమ్మ, వేప, ఇతర కలప కంటే ప్రస్తుతం నీలగిరికి మంచి డిమాండ్ ఉంది. భీమ్లా తండాలో నీలగిరి ప్లాంటేషన్ గత కొన్ని సంవత్సరాల నుంచి చేపట్టారు. ఏపుగా పెరిగి భారీ చెట్లుగా మారాయి. అటవీశాఖ అధికారులు ఇప్పటి వరకు ప్లాంటేషన్ నరికి వేయలేదు. అక్రమార్కులు మాత్రం భారీ నీలగిరి చెట్లను నేలకూలుస్తున్నారు. గత కొన్ని రోజులుగా నీలగిరి ప్లాంటేషన్‌లో చెట్లు నరికివేతకు గురవుతున్నా సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. అటవీ అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతోనే పరిస్థితి ఇలా దాపురించిందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్	95730 81675	పెద్దశంకరంపేట 80085 73251
నర్సాపూర్	80085 73222	రామాయంపేట 94402 31031
తూప్రాన్	96762 58144	(10AM TO 1 PM)
చేగుంట	80085 73200	

న్యూస్‌టుడే, అల్లాదుర్గం: ? అల్లాదుర్గం నుంచి నీలకంఠిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుపై పలుచోట్ల గుంతలు పడి కంకర తేలి ప్రమాదకరంగా మారింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– రమేష్, నీలకంఠిపల్లి

✓ త్వరలో సమస్య పరిష్కరించి అవస్థలు దూరం చేస్తాం.

– విజయకుమార్, పీఆర్ ఏఈ, అల్లాదుర్గం

రెండు కార్లు ఢీకొని 8 మందికి తీవ్ర గాయాలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణ పరిధిలో రగుడు శివారులోని బైపాస్ రోడ్డులో రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో 8 మందికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మెదక్ జిల్లా నిజాంపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్, షేక్ జానీ, మహమ్మద్ ఖలీల్, మహమ్మద్ ఆలీ హుస్సేన్, మహమ్మద్ కాసిం, డికావాల్ బేగం, ఎండి సల్మా, ఎండి సహిల్‌లు కారులో వేములవాడలో పెళ్లి చూపులకు వెళ్తున్నారు. రగుడు శివారులో వేములవాడ నుంచి వస్తున్న మరో కారును ఎదురుగా ఢీకొని రోడ్డు కిందకు దూసుకెళ్లడంతో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

దారి పొడవునా ధాన్యం..ఆదమరిస్తే ప్రమాదం



ప్రధాన రహదారుల వెంట ధాన్యం కుప్పలు పోయడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రయాణిస్తున్నారు. చిన్నశంకరంపేట మండల పరిధి శాలిపేట నుంచి రామాయంపేటకు వెళ్లే ప్రధాన రహదారి పొడవునా ధాన్యం కుప్పలను పోసి వాటిపై నల్లటి టార్పాలిన్లు కప్పి, పెద్దపెద్ద బండ రాళ్లు పెట్టి ఉంచుతున్నారు. చీకట్లో టార్పాలిన్లు సైతం నల్లగా ఉండడంతో దగ్గరకు వచ్చే వరకు ధాన్యం కుప్పలు కనిపించడం లేదని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రాత్రిళ్లు కుప్పల వద్ద మెరిసే రేడియం స్టిక్కర్లు ఉంచాలని కోరుతున్నారు. ఇష్టానుసారంగా రోడ్లపై ధాన్యం పోయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలకు దారితీస్తున్నాయి. - న్యూస్‌టుడే, చిన్నశంకరంపేట

పల్లెదారి కాదు.. పట్టణ రోడ్డే!



ఈ చిత్రంలో కనిపిస్తున్న రోడ్డు ఎక్కడో మారుమూల గ్రామంలో అనుకుంటే పొరపాటు పడ్డట్లే. తూప్రాన్ సమీకృత మార్కెట్ ముందు ప్రధాన రోడ్డుపై గత కొన్ని నెలలుగా మట్టి పేరుకుపోవడంతో దారంతా బురదమయమైంది. భారీ వాహనాలు వెళ్లడంతో కయ్యలుగా ఏర్పడి వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా తయారైంది. మూడు నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ర.భ.శాఖ లేదా పురపాలిక అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తూప్రాన్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

రామాయంపేట, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం ఢీకొని వాహనదారుడితోపాటు మరో వ్యక్తి గాయపడిన సంఘటన రామాయంపేట పట్టణ పరిధి కోమటిపల్లి జాతీయ రహదారి వద్ద బుధవారం రాత్రి జరిగింది. కామారెడ్డి జిల్లా రాజంపేటకు చెందిన కరీం ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళుతున్నాడు. కోమటిపల్లికి చెందిన గోపి రామాయంపేట నుంచి ఆటోలో దిగి జాతీయ రహదారి పక్కన ఉన్నాడు. కరీం ద్విచక్ర వాహనం అతన్ని ఢీకొట్టి అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఇద్దరిలో ఒకరిని సిద్దిపేటకు, మరొకరిని హైదరాబాద్‌కు ఆస్పత్రులకు తరలించారు.

హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వం: భాజపా



మెదక్ వ్యవసాయ విపణిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్, మురళీధర్‌గౌడ్

మెదక్ అర్బన్: ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని భాజపా జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం మెదక్ వ్యవసాయ విపణిలో పార్టీ రాష్ట్ర నాయకుడు మురళీధర్‌గౌడ్ తో కలిసి రైతులు ఆరబోసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు పండించిన పంటలు అకాల వర్షాలకు తడిసిపోతున్నాయన్నాని, టర్పాలిన్లను అందజేయాలన్నారు. రైతులకు వెంటనే న్యాయం చేయాలని లేదంటే భాజపా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్, పట్టణాధ్యక్షుడు ప్రసాద్, సీనియర్ నాయకులు రవీందర్, శివ, సన్నీ తదితరులున్నారు.

నమోదు పత్రాల పంపిణీ

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: కరీంనగర్, నిజామాబాద్ మెదక్, ఆదిలాబాద్ నియోజకవర్గ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగా మహేందర్ రెడ్డికి తమ మద్దతు తెలియజేయాలని పీఆర్టీయూటీఎస్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సునీల్, బుచ్చిరాములు అన్నారు. మహేందర్‌రెడ్డికి మద్దతుగా ఓటర్ నమోదు దరఖాస్తు పత్రాలను చిలప్‌చెడ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గౌతపూర్, చిట్కుల్ ఉన్నత, కేజీబీవీ చిట్కుల్ పాఠశాలలోని ఉపాధ్యాయులకు అందజేసి అవగాహన కల్పించారు.

ఓటర్‌గా నమోదు చేసుకోండి

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ల జాబితాలో ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని ఆర్డీవో రమాదేవి పేర్కొన్నారు. బుధవారం మెదక్ తహసీల్దార్ కార్యాలయంలో పట్టభద్రుల ఓటర్ల జాబితా ప్రక్రియలో భాగంగా ఓటరుగా నమోదు చేసేందుకు ఫారం-18ని దరఖాస్తును తహసీల్దార్ లక్ష్మణ్‌బాబుకు అందజేశారు.

● కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సభ్యుడి ఎన్నికల కోసం మెదక్ పట్టణం, మండల ఉపాధ్యాయుల నమోదు పత్రాలను మెదక్ మండల నాయబ్ తహసీల్దార్ మహేందర్‌గౌడ్‌కి పీఆర్టీయూ మెదక్ జిల్లా శాఖ నాయకులు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు కృష్ణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, సంగమేశ్వర్, రామకృష్ణ ఉన్నారు.

బలపరిచిన అభ్యర్థికి ఓటు వేయండి: భాజపా

వెల్దుర్తి, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న పట్టపభద్రల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపా బలపరిచిన అభ్యర్థికి ఓటు వేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు నర్సింలు, వెల్దుర్తి మండల ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యులు వెంకటేశం, శేఖర్‌గౌడ్ కోరారు. బుధవారం మండలంలోని కుకునూర్, మంగళపర్తి, మానేపల్లి ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిశారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అనంతరెడ్డి

వెల్దుర్తి, చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతులు దళారులకు విక్రయించి నష్టపోవద్దని డీసీసీబీ డైరెక్టర్, వెల్దుర్తి పీఏసీఎస్ ఛైర్మన్ తిరుమల అనంతరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మన్నెవారిజలాల్‌పూర్, యశ్వంతరావుపేట, మంగళపర్తి, మానేపల్లి, అందుగులపల్లి, ధర్మారం, దామరంచ, కుకునూర్ గ్రామాల్లో పీఏసీఎస్ వెల్దుర్తి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. గన్ని బస్తాలు, సుతిలీ కొనుగోలు కేంద్రాలకు సరఫరా కాగానే ధాన్యం తూకం చేపడతామని అప్పటి వరకు ధాన్యం కాపాడుకోవాలని రైతులకు సూచించారు. కరణం మురళి, పీఏసీఎస్ సీఈవో సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జంగారాయి సహకార సంఘం ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. చందాపూర్, అంబాజీపేట, జంగారాయి, గవ్వలపల్లి, కోర్విపల్లిలో కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రవీందర్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

నియంత్రిక ఏర్పాటు చేశారు.. కలపడం మరిచారు



కొల్చారం, న్యూస్‌టుడే: విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంతో కొల్చారం బీసీ కాలనీలో విద్యుత్తు అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి విద్యుత్తు సరఫరా చేసే సింగిల్ ఫేజ్ నియంత్రికకు లోడ్ ఎక్కువ కావడంతో తరచూ ట్రిప్ అవుతుంది. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అధిక లోడు నియంత్రించడానికి పక్కనే నాలుగేళ్ల క్రితం 63కేవీ నియంత్రిక ఏర్పాటు చేశారు. ఇంత వరకు దానికి కనెక్షన్ ఇవ్వకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

శివ్వంపేట: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. గత కొన్ని రోజులుగా గ్రామంలోని వ్యవసాయ భూముల్లో మట్టిని నగరంలోని పలు పరిశ్రమలకు అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్థులు బుధవారం తెలిపారు. రాత్రిళ్లు జేసీబీల సాయంతో తవ్వకాలు జరిపి టిప్పర్లలో తరలిస్తున్నారన్నారు. సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దార్ కమలాద్రిని వివరణ కోరగా..గుండ్లపల్లిలో మట్టి తవ్వకాలకు అనుమతులు లేవని, తవ్వకాలు జరిపిన వారిపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

సెంట్రింగ్ బాక్సుల చోరీ

శివ్వంపేట, న్యూస్‌టుడే: ఆలయ నిర్మాణం కోసం తెచ్చిన సెంట్రింగ్ బాక్సులను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట జిల్లా వర్గల్‌కు చెందిన పూస రాజు శివ్వంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం సెంట్రింగ్ బాక్సులు తెచ్చి ఉంచారు. అదేరోజు రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 70 సెంట్రింగ్ బాక్సులు చోరీ చేశారని బాధితుడి ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ఎస్సై చెప్పారు.

ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మెదక్ అర్బన్: ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని భారత ఎరుకల కులవృత్తుల అభివృద్ధి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కందెల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మెదక్ ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కౌన్సిలర్ సుంకయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

మాసాయిపేట (చేగుంట): పాఠశాల విద్యార్థులకు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని బుధవారం అందజేశారు. మాసాయిపేట మండలం పులిగుట్టతండాలో ధాన్ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా జీఎంఆర్ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ ఏఎస్‌వో చరణ్‌కుమార్, రామకృష్ణ అందజేశారు.

వివాదాస్పద భూములు పరిశీలించిన జేసీ



కొంతాన్‌పల్లిలో కుంట దారిని పరిశీలిస్తున్న జేసీ

శివ్వంపేట: మండలంలోని నవాబ్‌పేట గ్రామంలో పార్ట్-బిలో ఉన్న రెవెన్యూ, అటవీ సరిహద్దు వివాద భూములను జేసీ వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. ఈ భూముల పరిష్కారానికి కోసం ప్రత్యేక సర్వే బృందాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కొంతాన్‌పల్లిలో రహీం కుంట కింది భూములకు వెళ్లే దారిని కొందరు ఆక్రమించారని బాధితులు గతంలో ఫిర్యాదు చేయడంతో జేసీ పరిశీలించారు. కరీంకుంటకు నక్ష ప్రకారం బాట తీయాలని తహసీల్దార్‌ని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. తహసీల్దార్ కమలాద్రి, ఉప తహసిల్దార్ షఫియుద్దీన్, ఆర్ఐలు కిషన్, సునీల్ ఉన్నారు.

అంబులెన్స్ ఏర్పాటుతో ప్రజలకు మేలు



వాహనాన్ని ప్రారంభిస్తున్న దిగంబర్‌రావు

రేగోడ్, న్యూస్‌టుడే; రేగోడ్ మండలానికి అందించిన అంబులెన్స్ వాహనం వల్ల మారుమూల గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో మేలు జరుగుతుందని మాజీ ఎంపీపీ దిగంబర్ రావు అన్నారు. మండల ప్రజల విజ్ఞప్తి మేరకు ఎంఆర్ఎఫ్ ట్రస్టు అంబులెన్స్ వాహనాన్ని సమకూర్చడంతో బుధవారం ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అత్యవసర పరిస్థితిలో వైద్య సేవల కొరకు ప్రజలు అంబులెన్స్‌ను వినియోగించుకోవాలని కోరారు. నాయకులు శ్యాంరావు, నరేందర్, రాజేందర్‌పాటిల్ తదితరులున్నారు

అయ్యప్పల పాదయాత్రకు స్వాగతం



మాలధారులతో గురుస్వాములు, స్థానికులు

మనోహరాబాద్, న్యూస్‌టుడే: అయ్యప్ప మాలధారణలో భాగంగా నిర్మల్ జిల్లా బాసర పుణ్యక్షేత్రం నుంచి శబరిమల సన్నిధానం నుంచి 45 రోజుల పాటు 45 మంది అయ్యప్ప మాలధారులు మహా పాదయాత్ర చేపట్టారు. బుధవారం మండలంలోని కాళ్లకల్ బంగారమ్మ ఆలయానికి రాగా గురుస్వామి ప్రభాకర్‌గౌడ్, నత్తి మల్లేశ్, కనిగిరి రవి ఆధ్వర్యంలో వారికి ఘన స్వాగతం పలికారు. మాజీ సర్పంచి మల్లేశ్, ఎంపీటీసీ సభ్యురాలు లావణ్య ఆధ్వర్యంలో దీక్షధారులకు భిక్ష ఏర్పాటు చేశారు.

కుంగిన రోడ్డు..స్థానికుల ఇబ్బందులు

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని కోంటూర్ చెరువు పూర్తిగా నిండడంతో కోంటూర్- వెంకటాపూర్ మార్గంలో బుధవారం సాయంత్రం రోడ్డు కుంగింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు బంద్ అయ్యాయి. ద్విచక్ర వాహనాలు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి.

పోలీసు సేవలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ రేణుక

రేగోడ్, న్యూస్‌టుడే: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రేగోడ్ ఠాణాలో 'ఓపెన్ హౌస్' కార్యక్రమం నిర్వహించి ఆయా అంశాలు, పోలీసు శాఖ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విద్యార్థులు చట్టాలు, సైబర్ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ కోసం పోలీసులు పనిచేస్తున్నారన్నారు. ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై పోచయ్య ఉన్నారు.

పథకాలను ప్రజలకు వివరించి చెప్పండి: భాజపా

రేగోడ్, న్యూస్‌టుడే; భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేయాలని అందోలు శాసనసభ నియోజకవర్గ భాజపా ఇన్‌ఛార్జి జగదీశ్వర్ అన్నారు. బుధవారం రేగోడ్‌లో ఏర్పాటు చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర సంక్షేమ అభివృద్ధి పథకాలపై ప్రజలకు వివరించి చైతన్యవంతం చేయాలన్నారు. సంగమేశ్వర్, దత్తు, ప్రశాంత్ తదితరులున్నారు.

మంత్రిని కలిసిన నాయకులు

అల్లాదుర్గం: వట్‌పల్లి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ లక్ష్మీశేషారెడ్డి మంత్రి దామోదర రాజనర్సింహను బుధవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి, ఎస్సీ సెల్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం, యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేష్, నరసింహారెడ్డి తదితరులున్నారు

వెంకటేశం సేవలు మరువలేనివి

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: ముదిరాజ్ ముద్దుబిడ్డ కరణం వెంకటేశం చేసిన సేవలు ఎనలేనివని ముదిరాజ్ మహాసభ పొలిట్ బ్యూరో సభ్యుడు నారాయణ తెలిపారు. బుధవారం మెదక్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరణం జయంతి వేడుకలను ఈ నెల 30న మెదక్ పట్టణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభ ఉమ్మడి జిల్లా బాధ్యులు గోపాలకృష్ణ, వెంకట రవీందర్ తదితరులున్నారు.

క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

నర్సాపూర్: పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేయనున్నట్లు అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ తెలిపారు. క్లబ్ సభ్యులు తొంట వెంకటేశ్ ఇటీవల మృతిచెందారు. ఆయన భార్యకు రూ.10వేల ఆర్థిక సాయం బుధవారం అందించారు. క్లబ్ సభ్యులు ఎవరైనా మృతిచెందితే రూ.10వేలు అందజేయనున్నట్లు తీర్మానించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయండి

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: అకాల వర్షంతో తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మైసయ్య డిమాండ్ చేశారు. బుధవారం చిన్నశంకరంపేటలో ఆయన మాట్లాడారు. వానల వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు.

మాజీ ఛైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

తూప్రాన్, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో తనను అగౌరపరచిన మాజీ ఛైర్మన్ రాఘవేందర్ గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని తూప్రాన్ పురపాలిక ఛైర్‌పర్సన్ మామిళ్ళ జ్యోతికృష్ణ బుధవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. తూప్రాన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు వచ్చిన కలెక్టర్‌ని కలిసి ఆమె రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

గురుకుల కళాశాల ప్రిన్సిపల్‌కు డిప్యుటేషన్

నర్సాపూర్: నర్సాపూర్‌లోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపల్ బాలరాంను, నల్గొండకు ఇన్‌ఛార్జి ప్రాంతీయ సమన్వయకర్తగా డిప్యుటేషన్ వేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఉత్తర్వులు అందుకున్నారు. అనంతరం కళాశాల ఆవరణలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఇక్కడ ఎవరినీ ప్రిన్సిపల్‌గా నియమించలేదు.

గ్రంథాలయంలో ఆర్డీవో తనిఖీ

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: ఉద్యోగాలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తేవాలని ఆర్డీవో రమాదేవి పేర్కొన్నారు. బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆమె అకస్మికంగా సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, ఆర్ఐ లక్ష్మణ్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ, గ్రంథ పాలకులు నరేందర్‌రెడ్డి, శంకర్, యాదగిరి సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న గెలిపించండి

చేగుంట, న్యూస్‌టుడే: కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని మామిడి సుధాకర్‌రెడ్డి కోరారు. బుధవారం చేగుంట, రెడ్డిపల్లి, వడియారంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ఎన్నికల్లో పోటీ చేసి మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఉపాధ్యాయులందరూ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. వారి సమస్యల పరిష్కారానికి మండలిలో గళం వినిపిస్తానన్నారు.

ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

మనోహరాబాద్, న్యూస్‌టుడే: కూచారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీల భర్తీకి స్థానికులకు అవకాశం కల్పిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి గౌతమి తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలలో స్వీపర్, డే వాచ్ ఉమెన్ (హెల్పర్)లుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు.

అసంపూర్తి నిర్మాణం..అవస్థల్లో విద్యార్థులు



విద్యార్థులు చెట్లకింద మట్టిలో కూర్చుని భోజనం చేస్తుండగా దుమ్ము, దూళి అందులో పడుతుంది. వీరి ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని భోజనశాల నిర్మాణ పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. నార్సింగి జడ్పీ ఉన్నత పాఠశాలలో 500మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటికీ మధ్యాహ్న భోజనం చెట్ల కిందనే కూర్చుని తింటున్నారు. 'మన ఊరు-మన బడి' పథకం కింద భోజనశాల నిర్మాణం కొన్ని నెలల కిత్రం చేపట్టి గోడల వరకు నిర్మించి వదిలేశారు. పూర్తి చేయించేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. వెంటనే పనులు పూర్తిచేసి భోజనశాలను వినియోగంలోకి తేవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నార్సింగి (చేగుంట)

సూచికలు ఏర్పాటు చేయరూ!



రెడ్డిపల్లి ప్రధాన కూడలి వద్ద..

నర్సాపూర్ మండలంలోని మెదక్-నర్సాపూర్-హైదరాబాద్ జాతీయ రహదారి(765-డి)పై రెడ్డిపల్లి వద్ద సూచికలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకవైపు చిప్పల్‌తుర్తి నుంచి, మరోవైపు రెడ్డిపల్లి నుంచి వాహనదారులు వేగంగా జాతీయ రహదారిపైకి వస్తున్నారు. దీంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంకో వైపు జాతీయ రహదారి కావడంతో వాహనాలు వేగంగా వెళుతున్నాయి. రెడ్డిపల్లి గ్రామం వరకు విభాగిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సూచిక బోర్డులు ఏర్పాటు చేయక ప్రమాదాల తీవ్రత ఎక్కువగా నమోదు అవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నర్సాపూర్